సాక్షి తిరుపతి

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



మమ్మల్నే టోకెన్ తీసుకోమంటారా?
'మేం అధికార పార్టీ నేతలం.. టీ తాగేందుకు మమ్మల్నే టోకెన్ తీసుకో మంటావా' అంటూ టీడీపీ మూకలు రెచ్చిపోయారు. - 8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం
మామండూరు, ఎర్రావారిపాళెం ప్రాంతాల్లో అక్రమంగా తరలుతున్న ఎర్రచందనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



నాలుగు నెలల్లో పూర్తి
జిల్లాలో పశుగణాంక సర్వే నాలుగు నెలల్లో పూర్తి చేయనున్నట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

పాఠశాలల అభివృద్ధే లక్ష్యం



కలెక్టర్‌తో నూతన డీఈఓ కే.వెంకటనాగేంద్రకుమార్

తిరుపతి అర్బన్: పాఠశాలల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని నూతన జిల్లా విద్యాశాఖాధికారి కే.వెంకట నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లా డీఈఓగా పని చేస్తున్న ఆయన తిరుపతి జిల్లాకు వచ్చారు. ఆ మేరకు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ మెరుగైన మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు చేపడుతామన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం విషయంలో కచ్చితంగా మెనూ ప్రకారం అందించాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. నిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ విద్యాశాఖను అభివృద్ధి బాటలో నడిపిస్తామని చెప్పారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈఓను పలువురు ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

29న తిరుపతిలో జాబ్ మేళా

తిరుపతి అర్బన్: తిరుపతిలోని గేట్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న ఉదయం 9గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్. లోకనాథం తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థతోపాటు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ సంస్థ సంయుక్తంగా జాబ్ మేళా చేపడుతాయని పేర్కొన్నారు. బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్టు వెల్లడించారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా కోర్సులు చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. వారి విద్యార్హతను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. ఆ మేరకు సర్టిఫికెట్లతోపాటు ఆధార్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 8143576866 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న అదనపు సివిల్ జడ్జి

తిరుపతి తుడా: వైద్య విద్యార్థులు ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉంటూ పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని తిరుపతి జిల్లా మూడవ అదనపు సివిల్ జడ్జి ఎం.గురునాథ్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్వీ వైద్యకళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి యాంటీర్యాగింగ్ అవగాహన సదస్సుకు ఆయన ప్రిన్సిపల్‌తో పాటు సీనియర్ జడ్జి టీ.విజయసారథి, అదనపు సీనియర్ జడ్జి సునీత, రిటైర్డ్ జడ్జి రాజీవ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, డాక్టర్ రామాంజనేయులు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ, పీఆర్ఓ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విలువైన ఖనిజాన్ని దోచుకునేందుకు కూటమి నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. లీజులు ముగిసిన గనులపై ఆధిపత్యం కోసం ఎత్తుకుపై ఎత్తు వేస్తున్నారు. అందినకాడికి అడ్డంగా దోచుకునేందుకు ప్రత్యర్థులకు సైతం చుక్కలు చూపిస్తున్నారు. ఇక్కడ తామే డాన్‌లమని విర్రవీగుతున్నారు. తమ అక్రమ సామ్రాజ్యానికి అడ్డుతగిలితే అంతు చూస్తామని కత్తులు దూస్తున్నారు. నిత్యం ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ.. మామూళ్ల మత్తులో జోగుతున్న మైనింగ్, పోలీసు అధికారులను పరుగులు తీయిస్తున్నారు. కేజీఎఫ్ సినిమాను తలపిస్తున్న వెంకటగిరి నియోజకవర్గంలోని మైనింగ్ మాఫియాపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



కేజీఎఫ్-3

- కాలం చెల్లిన గనులు.. కూటమి నేతల పనులు
- 26 గనులను దక్కించుకునేందుకు కుమ్ములాటలు
- ఒకరిపై ఒకరు ఫిర్యాదులు, పట్టింపులు
- ఇటీవల పార్టీలో చేరిన నేత కనుసన్నల్లో మైనింగ్ ఆపరేషన్
- కొత్త..పాత గొడవలతో తలలు పట్టుకుంటున్న అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి నియోజకవర్గంలో మైనింగ్ మాఫియా మరో కేజీఎఫ్‌ను తలపిస్తోంది. గతంలో ఆక్రమించుకుని అక్రమంగా వ్యాపారాలు చేసే వారిపై కొత్తవారు రంగప్రవేశం చేసి తామే డాన్‌లమంటూ హెచ్చరికలు జారీచేస్తున్నారు. కాలం చెల్లిన గనులను దక్కించుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. 'ఈ గనులు నావి.. మీరు వస్తే బాగుండదు.. ఆ గనులు మా ప్రాంతానివి మాకు 50 శాతం వాటాలివ్వాలి' అంటూ ఓ ప్రజాప్రతినిధి హుకుం జారీ చేశారు. అందులో భాగంగా పంపకాల్లో తేడాలు రావడంతో ఓ గనిలో అనధికారికంగా పనులు చేస్తున్న విషయాన్ని బహిర్గతం చేశారు. ఇందులో గతంలో వైఎస్సార్‌సీపీని వీడి కూటమి పార్టీలో చేరిన నెల్లూరు కార్పొరేషన్‌కు చెందిన ఓ నేత పాత్ర ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

పంపకాలు.. వివాదాలు

సైదాపురం మండల కేంద్రానికి కూత వేటు దూరంలోనే శ్రీనివాస పద్మావతి గని ఉంది. గతంలో ఆ గని యాజమాని లీజుతో పనులు చేసేవారు. కుటుంబ విబేధాల కారణంగా ఏడాది క్రితం నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి కొంత నగదును ఆ యజమానికి ముట్టజెప్పి ఆ గనిని సొంతం చేసుకున్నారు. కానీ ఆ గనికి లీజు వ్యవధి తీరిపోయింది. ఇటీవలనే వైఎస్సార్‌సీపీ వీడి కూటమిలో చేరిన నెల్లూరుకు చెందిన ఓ నేత కనుసన్నల్లో పనులు జరిగేవని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కూడా తన అనుచరులతో ఆ గనిలో నిత్యం పనులు చేస్తున్నట్టు సమాచారం. కానీ స్థానిక కూటమి ముఖ్యనేత 50 శాతం వాటా కావాలంటూ పట్టుబట్టడంతో.. వారిమధ్య ఏమి జరిగిందో తెలియదుగానీ స్థానిక చోటా నేత పర్యవేక్షణలో అధికారులు ఆ గనిపై మూకుమ్మడిగా దాడులు చేశారు. ఆ గనిలో ఉన్న రెండు టిప్పర్లు, హిటాచీ, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుకు చెందిన కూటమి నేత ముఖ్య అనుచరుడితో పాటు 13 మందిపై కేసును నమోదు చేశారు. దీంతో కూటమి నేతల మధ్య వాటాల పంపిణీలో వివాదం రేగింది.

జయలక్ష్మి.. ధనలక్ష్మి

సైదాపురం మండలంలోని ఓరుపల్లి గ్రామ సమీపంలో జయలక్ష్మి మైకామైన్ ఉండేది. గతంలో చెన్నైకి చెందిన ఓ పెద్ద ప్రైవేట్ కంపెనీ ఆధీనంలో ఇది ఉండేంది. 1974 నుంచి 2021 వరకు శ్రీ షిరిడి సాయి మైన్స్ కంపెనీ వారికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. 18-03-2021 ఆ కంపెనీకి లీజు గడువు ముగిసింది. సర్వే నం.1లో 12.65 సెంట్లు గ్రామనత్తం పోరంబోకు భూమి, 2-1లో 14-29 ఎకరాల్లో అనాధీనం భూమి ఉంది. ఆ కంపెనీకి చెందిన వారు మళ్లీ లీజుకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ లీజు మాత్రం నేటికీ ఇవ్వలేదు. ఆ గని సదరు యజమాని నుంచి ముగ్గురు వ్యక్తులకు కూడా మార్పిడి జరిగింది. కానీ లీజు మాత్రం ఇవ్వలేదు. ప్రస్తుతం తానే ఆ గనిని కొనుగోలు చేసి గత ఏడాది నుంచి పనులు సాగిస్తున్నారు. ఇటీవల ఆ గనిలో కూటమి నేతలు ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించేందుకు పూనుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రస్తుతం ఆ గని దక్కించుకున్న వారంతా కోటీశ్వరులుగానే చలామణి అవుతున్నారు. ఆ గనిలో ఉన్న తెల్లరాయికి మంచి గిరాకీ ఉండడమే కారణం.

జులాయిలే బడా డాన్‌లు

జులాయిలుగా తిరిగే వారు కూడా అక్రమ మైనింగ్ వల్ల కోటీశ్వరులైపోతున్నారు. ఒకరైతే ఏకంగా లక్షల విలువ చేసే మూడు కొత్తకార్లు కొనుగోలు చేసి తన ప్రతాపం చూపారు. మరో గ్రామంలో మామూళ్లు వసూలు చేసే వ్యక్తి రెండు స్కార్పియోలు కొనుగోలు చేసి హంగామా చూపుతున్నారు. మరొక ఊరిలో చోటా నేతలు సుమారుగా కోటి రూపాయల వరకు రౌడీ మామూలు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ నాలుగు నెలల్లోనే మైనింగ్ డాన్‌లకు ఎదురు లేకుండా పోతోంది. తన వద్ద ఉన్న మూడు గనులను లాక్కుని, ఆ గనుల్లో గతంలోనే ఉన్న సుమారు రూ.100 కోట్ల విలువైన ఖనిజాన్ని ఊడ్చేశారని ఓ వ్యాపారి గగ్గోలు పెడుతున్నారు.

ఆ'గని' అక్రమాలు!



అక్రమంగా తరలిపోతున్న ఖనిజ సంపద

శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లాలోని సైదాపురం, పొదలకూరు, చేజర్ల, ఉదయగిరి మండలాలతో పాటు తిరుపతి జిల్లాలోని గూడూరు ప్రాంతాల్లో దొరికే క్వార్ట్జ్, ఫల్స్‌పర్, వర్ముఖ్‌లైట్ ఖనిజానికి మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. సైదాపురం మండలంలో దొరికే క్వార్ట్జ్ మైకా ఖనిజానికి విపరీతమైన డిమాండ్ ఉంది. కూటమి నేతలు ఆయా ప్రాంతాలపై గద్దల్లా వాలిపోయారు. ఒక్క సైదాపురం మండలంలోనే కాలం చెల్లిన గనులు 26 ఉన్నాయి. గతంలో లీజు కాలవ్యవధి తీరిపోవడంతో అవి అలాగే వదిలేశారు. కొన్ని గనులకు లీజులు వేసినా అనుమతులు ఇవ్వలేదు. ఆ గనులను కొందరు వ్యాపారులు స్కాప్ మైకా కోసం కొంత నగదును పాత యాజమానికి ముట్టచెప్పి పనులు చేసుకునే వారు. ఆవి కూడా సైదాపురంలో మూడు, చాగణం రాజుపాళెంలో నాలుగు, ఊటుకూరులో మూడు, పెరుమాళ్లపాడులో మూడు, పెరుమాళ్లపాడు-తురిమెర్ల మధ్యలో మరో రెండు, కలిచేడులో రెండు, గిద్దలూరులో రెండు, జోగిపల్లిలో 4, తలుపూరులో మరో 5 గనులు ఉన్నాయి. ఈ 26 గనుల్లో గతంలో గుట్టలు గుట్టలుగా వదిలేసిన మైకా క్వార్ట్జ్ ఖనిజాన్ని ఇష్టానుసారంగా తరలించేస్తున్నారు.



క్వార్ట్జ్ టన్ను రూ.2 లక్షలు

సైదాపురం మండలంలో దొరికే మైకా క్వార్ట్జ ఖనిజం టన్ను రూ.20వేల నుంచి రూ.2లక్షల దాకా పలుకుతోంది. దీంతో అక్రమార్కులు కాలం చెల్లిన గనుల్లో ఉన్న ఖనిజాన్ని అడ్డదిడ్డంగా దోచేస్తున్నారు. కొందరు కూటమి నేతలు ఆ గనుల్లోని ఖనిజాన్ని సొంతం చేసుకునేందుకు రాజకీయ పైరవీలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తామకేమీ తెలియదన్నట్టు చేతులు ముడుచుకు కూర్చోవడం గమనార్హం.



లోయను తలపిస్తున్న గని



కాలం చెల్లిన గనుల్లో పనులు



యంత్రాలతో ఇష్టారాజ్యం



సైదాపురం : అనుమతులు లేని గనుల్లో అధికారుల తనిఖీ(ఫైల్)

షాడోలా .. మజాకా!

- కుప్పం నుంచి గూడూరు దాకా పెత్తనమంతా షాడో ఎమ్మెల్యేలదే
- ఎమ్మెల్యేని కలవాలంటే ముందుగా షాడో చెప్పాలి
- పనులైనా.. పైరవీలకైనా అంతా వారి కనుసన్నల్లోనే
- అధికారుల బదిలీలు జరిగినా వారి ఆధీనంలోనే
- టెండర్లు, మద్యం, ఇసుక దందాల్లో ఇష్టారాజ్యం
- సెటిల్ మెంట్లలో షాడోలే ముందు.. ఆ తర్వాత పంపకాలు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో షాడోల పెత్తనంపై గుర్రుమంటున్న పార్టీ శ్రేణులు



సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో షాడో ఎమ్మెల్యేల పెత్తనం అధికమైంది. షాడోలను ఎమ్మెల్యేలే ప్రోత్సహిస్తుండడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యేని కలవాలన్నా.. పనులు, కాంట్రాక్టులు, పదోన్నతులు, బదిలీలు, మద్యం, ఇసుక వ్యవహారాలు ఇలా ఏదైనా.. ముందు షాడో ఎమ్మెల్యేని కలవాలి. ఆయన గారు ఓకే అంటేనే.. ఎమ్మెల్యేతో కలిసే భాగ్యం కలుగుతుంది. లేదంటే.. అట్నుంచి అటే ఇంటిదారి పట్టాల్సిందే. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కూటమి ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పరిస్థితిపై ఆ పార్టీల నేతలు అధినాయకులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

తిరుపతిలో త్రిముఖ పోటీ!

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు ఆరణి శివ, కుమారుడు ఆరణి మదన్‌మోహన్, పట్టణ జనసేన అధ్యక్షులు రాజారెడ్డి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో కూడా ఎమ్మెల్యే హోదాలో పాల్గొంటున్నారు. బదిలీలు, పదోన్నతులు, టెండర్లు, తిరుమలలో శ్రీవారి దర్శన టికెట్లు, ఇతర పార్టీ శ్రేణులను జనసేనలోకి చేర్చుకునే విషయంలోనూ ఆరణి శివ కీలకంగా వ్యవహరిస్తున్నారు. భూ సెటిల్‌మెంట్లలో శివ చురుగ్గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇతని దూకుడు చూసిన ఎమ్మెల్యే కుమారులు ఆరణి మదన్‌మోహన్, జగన్‌మోహన్ కూడా షాడో ఎమ్మెల్యేల అవతారం ఎత్తారు.

కుప్పం.. శ్రీకాంత్‌కే కప్పం!

కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి కూడా. అయితే కుప్పంలో చక్రం తిప్పేది ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్. కుప్పంలో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. మొదటి నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులను పక్కనబెట్టిన చంద్రబాబు ప్రకాశం నుంచి తీసుకొచ్చిన శ్రీకాంత్‌ను కుప్పంలో ఉంచారు. ఆయనకే పనులు చక్కబెట్టే బాధ్యతను అప్పగించారు. నియోజకవర్గంలో ఏ చిన్న పని కావాలన్నా ఎమ్మెల్సీ నుంచి ఫోన్ వెళ్లాలి. ఆయనగారిని కాదని నియోజకవర్గంలో ఏ అధికారి టీడీపీ, జనసేన నాయకులకు పనులు చేసిపెట్టరు. అధికారుల బదిలీలు, నియామకాలు, పదోన్నతులు, సెటిల్‌మెంట్లు, ఇతర పార్టీ నేతలపై అక్రమ కేసులు, పార్టీలో చేర్చుకోవడం వంటి అన్ని విషయాల్లో శ్రీకాంత్ హస్తం ఉండాల్సిందే. కలెక్టర్, ఎస్పీ కూడా శ్రీకాంత్ చెప్పినట్లు వినాల్సిందే. శ్రీకాంత్ కనుసన్నల్లోనే అధికారులు, నాయకులు వ్యవహరిస్తుంటారు.

శ్రీకాళహస్తిలో అమ్మదే పెత్తనం!

శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్థానికంగా లేనప్పుడు తల్లి బొజ్జల బృందమ్మ, భార్య షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తుంటారు. అధికారులు, నాయకులు వీరిద్దరినీ కలిసి పనులు చక్కబెట్టుకుంటుంటారు. చంద్రగిరిలో పులివర్తి సుధ అన్నీ తానై వ్యవహరిస్తుంటారనే ప్రచారం ఎక్కువగా ఉంది.

చిట్టిబాబు చుట్టూ జీడీనెల్లూరు!

జీడీనెల్లూరు నియోజకవర్గంలో చిట్టిబాబు నాయుడు పెత్తనం ఎక్కువని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే థామస్‌కి ఇతనికి మొదట్లో పడకపోయినా.. చంద్రబాబు రాజీ కుదిర్చినట్లు తెలిసింది. అప్పటి నుంచి ఆయన షాడో ఎమ్మెల్యేగా అవతారం ఎత్తారు.

చిత్తూరు..షాడోల జోరు

చిత్తూరులో ఎమ్మెల్యే జగన్మోహన్ సోదరుడు జీవన్, మరో ఇద్దరు టీడీపీ నేతలు ఎస్ఆర్ఐ రవి, వసంత్ ముగ్గురూ సెటిల్ మెంట్లు, భూ తగాదాలు సృష్టించి డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా గ్రానైట్ క్వారీలు లాక్కుని వేరొకరికి లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. మరో వైపు పేకాట శిబిరాలను కూడా వీరే నడుపుతూ డబ్బులు సంపాదిస్తున్నట్లు చిత్తూరు నగరంలో జోరుగా ప్రచారం జరుగుతోంది.

పూతలపట్టు.. జయప్రకాష్‌కే పట్టు!

పూతలపట్టులో బంగారుపాళెంకు చెందిన జయప్రకాష్ నాయుడు షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నాడు. జయప్రకాష్ లెటర్ పంపితే ఎమ్మెల్యే మురళీమోహన్ సంతకాలు చేసి పంపుతుంటారనే ప్రచారం ఉంది.

సత్యవేడులో చక్రం తిప్పుతున్న సుమన్

సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు కోనేటి సుమన్ నియోజకవర్గంలో చక్రం తిప్పుతున్నారు. అధికారుల బదిలీలు, పోస్టింగ్స్, ఇసుక అక్రమ రవాణా, సెటిల్ మెంట్లు అన్నింటా సుమన్ పాత్ర ఉంటుందనే ప్రచారం ఉంది. తండ్రి ఎమ్మెల్యే వద్దకంటే కుమారుడు సుమన్ వద్దకే నాయకులు, అధికారులు పనులు కోసం వెళ్తుంటారు.

మూడు నియోజకవర్గాల్లో కొండెపాటిదే రాజ్యం

గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యే కంటే.. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండెపాటి గంగాప్రసాద్ పెత్తనమే ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. బదిలీలు, పోస్టింగ్స్, సిలికా, ఇసుక, మైనింగ్ తవ్వకాలు, రవాణా అన్నింటా.. ఆయన పాత్ర ఉందనే ప్రచారం జరుగుతోంది. తన ముఖ్య అనుచరుడు నానాజీ పెత్తనం కూడా అధికం. సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రాజకీయ అనుభవం లేకపోవడంతో తండ్రి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. గ్రావెల్, ఇసుక, మట్టి, బియ్యం రవాణా వంటి వ్యాపారాలన్నీ తన కుమారులు నెలవల రాజేష్ కూడా చూస్తుంటారని, కాంట్రాక్టులు కూడా నేరుగా వీరే చేస్తున్నారనే ప్రచారం ఉంది.

అబ్బురపరిచిన ఓపెన్ హౌస్



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్లో శనివారం నిర్వహించిన ఓపెన్ హౌస్(ఆయుధాల ప్రదర్శన) అబ్బురపరిచింది. ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ అడ్మిన్ వెంకట్రావు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విచ్చేసిన విద్యార్థులతో అదనపు ఎస్పీ ముచ్చటించారు. ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల ఆయుధాలు, పోలీసు పరికరాలు, వాటి పనితీరు గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించినట్టు వెల్లడించారు. అందులో భాగంగా 26, 27 తేదీలలో తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు.

వ్యాసరచన పోటీలు

విద్యార్థులకు నిపుణుల పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైమ్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు, బృంద చర్చలు పోటీలు నిర్వహించారు. అదే సమయంలో సమాంతరంగా పోలీసులకు, పోలీసుల పిల్లలకు 'చాలెంజెస్ టు పోలీస్ ఇన్ ద ప్రజెంట్ ఎన్విరాన్మెంట్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు, బృంద చర్చలు పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (సాయుధ దళం) శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీలత, చిరంజీవి, ఏఆర్, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,501 మంది స్వామివారిని దర్శించుకోగా 21,203 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

బంగారు ఆభరణాల చోరీ


బీరువాలోని వస్తువులను చిందర వందరగా పడేసిన గుర్తుతెలియని వ్యక్తులు

ఓజిలి: తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన ఓజిలి మండలం, సగుటూరు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన వీ.నాగమణి శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాను తీసి ఉంది. అందులోని 21 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.26 వేల నగదు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లినట్టు గమనించింది. దీంతో బాధితురాలు స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ సంగమేశ్వర్‌రావు, ఎస్ఐ స్వప్న ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌టీం వేలిముద్రల నిపుణులతో తనిఖీలు చేపట్టారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఐషర్



చిల్లకూరు: ఆగి ఉన్న లారీని ఐషర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం రాత్రి బూదనం సమీపంలో చోటు చేసుకుంది. నాయుడుపేట నుంచి గూడూరు వైపు వస్తున్న లారీ బూదనం సమీపంలోకి వచ్చే టైర్ పగిలిపోవడంతో రోడ్డుపైనే నిలిచిపోయింది. అదే సమయంలో నాయుడుపేట వైపు నుంచి నెల్లూరు వెళుతున్న ఐషర్ వాహనం రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనక వైపు నుంచి ఢీకొట్టింది. ఐషర్ లారీ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్ శ్రీను(40) ఐషర్ క్యాబిన్‌లోనే ఇరుక్కు పోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ట్రెక్కింగ్ బాలుకు అవార్డు


అవార్డుతో ట్రెక్కింగ్ బాలు

తిరుపతి కల్చరల్: తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ ట్రెక్కింగ్ సంస్థ మెజాయిక్ అడ్వెంచర్ కమ్యూన్(మాక్)కు చోళన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు లభించింది. ఈమేరకు మాక్ ఆర్గనైజర్ బీ.బాలసుబ్రమణ్యం(ట్రెక్కింగ్ బాలు)కు అవార్డుతో పాటు ప్రశంసా పత్రం, మెడల్ అందజేశారు.

మమ్మల్నే టోకెన్ తీసుకోమంటారా?

- హోటల్ సిబ్బందిపై టీడీపీ మూకల దాడి
- గాదంకి టోల్‌ప్లాజా వద్ద మద్యం మత్తులో వీరంగం
- టీ బిల్లు అడిగినందుకు కర్రలు, రాడ్లతో దాడి
- హోటల్‌ను ధ్వంసం చేసి పైశాచిక ఆనందం
- దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- నిందితులు పాకాల మండలానికి చెందిన టీడీపీ నాయకులుగా గుర్తింపు


మద్యం మత్తులో హోటల్‌లోని ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు

చంద్రగిరి: 'రేయ్ అధికారం మాదే.. మేము లోకల్. మాకు టీ, కాఫీ, టిఫిన్ ఏమడిగినా ఉచితంగా ఇవ్వాల్సిందే. లేదంటే మీ అంతు చూస్తాం'.. అంటూ టీడీపీ మూకలు ఓ హోటల్‌పై దాడికి తెగబడ్డారు. హోటల్‌ను ధ్వంసం చేయడంతో పాటు అడ్డొచ్చిన సిబ్బందిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి, పాకాల వారిపల్లి సమీపంలోని గాదంకి టోల్‌ప్లాజా వద్ద గల తాటిబెల్లం టీ దుకాణంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. పాకాల మండలం, సూరినేనివారిపల్లికు చెందిన టీడీపీ నాయకులు పాంత్ర దిలీప్‌నాయుడు, మనోజ్, గౌతమ్, దినేష్ శుక్రవారం అర్ధరాత్రి మద్యం సేవించి తాటిబెల్లం టీ దుకాణం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆ నలుగురూ టీ తాగేందుకు వెళ్లారు. ముందుగా టోకెన్ తీసుకుని రావాలని కోరడంతో ఒక్కసారిగా రెచ్చిపోయారు. 'ఎంత ధైర్యం ఉంటే మమ్మల్నే టోకెన్ అడుగుతారా.. మీకు ఇంత గర్వమా..? మేము లోకల్ రా.. టీడీపీకి చెందిన మమ్మల్నే టోకెన్ అడిగే అంత దమ్ముందా..' అంటూ నానాయాగి చేశారు. మద్యం సేవించి ఇలా గొడవ చేయడం మంచిది కాదంటూ స్థానికులు, దుకాణాదారులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు.

అధికారాన్ని అడ్డం పెట్టుకుని అరాచకాలా?

టీ తాగేందుకు వచ్చిన వారిని టోకెన్ తీసుకోవాలని చెప్పడం తప్పా..? అధికారం మాది అని.. దుకాణంతో పాటు సిబ్బందిపై దాడి చేయడంపై స్థానిక దుకాణాదారులు మండిపడుతున్నారు. ఇటువంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. దీనిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కేసు నమోదు

పాకాల మండలానికి చెందిన టీడీపీ నాయకులు చేసిన బీభత్సాన్ని దుకాణాదారుడితో పాటు స్థానిక వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

కర్రలు, రాడ్లతో దాడి

దుకాణాదారులు వారిని నిలువరించే ప్రయత్నం చేయడంతో తెలుగు తమ్ముళ్లు మరింత రెచ్చిపోయారు. కర్రలు, రాడ్లతో దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది దీపక్, చేతన్, ఉదయ్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం హోటల్‌లోని ఫర్నిచర్, అద్దాలు, దుకాణాన్ని ధ్వంసం చేశారు. టీ దుకాణం వద్దకు చేరుకుని అక్కడి సామగ్రిని చెల్లాచెదురుగా పడేశారు. టీడీపీ మూకల దౌర్జన్యాన్ని చూసిన ప్రయాణికులు అక్కడి నుంచి పరుగులు తీశారు. సుమారు గంట పాటు ఆ ప్రాంతంలో బీభత్సం సృష్టించారు. త్వరలోనే దుకాణాన్ని లేపేస్తామంటూ.. అక్కడి నుంచి వెళ్లిపోయారు. టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఇందులో దీపక్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. మద్యం మత్తులో టీడీపీ నాయకుల బీభత్సం సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో ఆ మేరకు బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

నాలుగు నెలల్లో పశువుల లెక్క పూర్తి


సర్వే చేస్తున్న సిబ్బంది

తిరుపతి అర్బన్: జిల్లాలో పశువుల లెక్కలు నాలుగు నెలల్లో పూర్తిచేయనున్నారు. ఈ మేరకు శనివారం నుంచి పశుగణను ప్రారంభించారు. 472 మంది ఎన్యూమరేటర్లతోపాటు 72 మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 5.97 లక్షల కుటుంబాల్లో పశుగణన చేపట్టాల్సి ఉంది. 1,023 రెవెన్యూ గ్రామాలతోపాటు 221 వార్డుల పరిధిలోని ఆవులు, గేదెలతోపాటు పశు సంవర్ధకశాఖ పరిధిలోని పలు మూగజీవాలను లెక్కించనున్నారు. 2019లో పశువుల గణాంకాలు తీశారు. ఆ తర్వాత 2023లో జరగాల్సి ఉండగా ఓ వైపు ఎన్నికల హడావుడి, వరదలు నేపథ్యంలో 2024లో చేపడుతున్నారు.

స్పష్టమైన సమాచారం తెలుస్తుంది



పశుగణాంకాలు పూర్తి చేస్తే జిల్లా వ్యాప్తంగా వాటి వివరాలు స్పష్టంగా తెలుస్తాయి. దీనిపై ఇప్పటికే సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చాం. పశుగణనపై ప్రత్యేక నిఘా ఉంటుంది. కచ్చితమైన సమాచారం మరో నాలుగు నెలలకు తెలుస్తుంది.

–రవికుమార్, పశుసంవర్థకశాఖ జేడీ

విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై పెనుభారం

- విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వామపక్ష నేతల ధర్నా



విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న వామపక్ష నేతలు

తిరుపతి కల్చరల్: భూటకపు మాటలతో అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెనుభారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు పీ.మురళి, వందవాసి నాగరాజు ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో లీలామహల్ సర్కిల్, చేపల మార్కెట్ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రజానీకంపై మూడు నెలలకే రాష్ట్ర ప్రభుత్వం మోత మోగించిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.6,072 కోట్ల భారాన్ని ప్రజలపై మోపి నడ్డివిరిచిందన్నారు. 2022–23 ఏడాదికి ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట ఆడ్జెస్‌మెంట్ వసూళ్లకు ట్రూ ఆఫ్ చార్జీలు ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ అనుమతించిందని తెలిపారు. డిస్కంలో రూ.8,114 కోట్లు ప్రతిపాదిస్తే అందులో రూ.2,024 కోట్లు తగ్గించి ఉపశమనం కలిగించినట్లు ఏపీ ఆర్‌సీ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. 2022 ఏప్రిల్‌లో వినియోగించిన విద్యుత్‌కు ట్రూ ఆఫ్ చార్జీలను ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో వసూలు చేయబోతున్నారన్నారు. 2022 మే నెల ఖర్చును 2025 జనవరి ఫ్రిబ్రవరిలో, 2022 జూన్ వినియోగాన్ని 2025 మార్చి, ఏప్రిల్‌లో, జూలై నెల వినియోగాన్ని 2025 మార్చిలో వసూలు చేయబోతున్నారని తెలిపారు. అప్పుడెప్పుడో వాడిన కరెంట్‌కు ఇప్పుడు అదనంగా చార్జీలు చెల్లించాలన్న ఎఫ్‌పీపీ సీఏ విధానం మోసపూరితమైందన్నారు. గతంలో పోల్చుకుంటే ఇది 44 శాతం పెరుగుదల అని తెలిపారు. ప్రజలపై వేసిన ట్రూ ఆఫ్ చార్జీల భారాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు జయచంద్ర, సాయిలక్ష్మి, బాలసుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, కే.వేణుగోపాల్, పీ.బుజ్జి, ఎం.నరేంద్ర, చిన్నబాబు, హేమలత, రాధాకృష్ణ, మునిరాజా, కేఆర్.సుబ్రమణ్యం, రవి, మోహన్ నాయుడు, ప్రసన్న, సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, ఉదయ్, కేవై.రాజా పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి మంగళం: అక్రమంగా తరలిస్తున్న వాహనంతో పాటు ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీ ఉన్నతాధికారికి అందిన రహస్య సమాచారం మేరకు శనివారం మామండూరు మార్గంలోని ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో వేగంగా వస్తున్న వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా వారు తిరిగి మామండూరు వైపు వెళ్లిపోయారు. దాంతో వారిని వెంబడించగా స్మగ్లర్లు కారును చెట్లల్లో వదిలేసి పారిపోయారు. కారుని పరిశీలించగా అందులో 294 కిలోల బరువు గల ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. టీఎన్‌03– 3839 నంబర్ గల ఫోర్డ్ కారుతో పాటు ఎర్రచందనాన్ని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఆర్ఓ బీ. సుదర్శన్ రెడ్డి, ఎఫ్ఎస్ఓ రవీంద్ర, ఎఫ్‌బీఓ వెంకటేశ్వరరావు, కిషోర్‌కుమార్, స్ట్రైకింగ్‌ఫోర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

14 ఎర్రచందనం దుంగల స్వాధీనం


భాకరాపేట: స్వాధీనం చేసుకున్న కారు, ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులు

భాకరాపేట : వాహనం సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ ఎస్ వెంకట్రమణ తెలిపారు. శనివారం సాయంత్రం భాకరాపేట ఫారెస్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రహస్య సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఎర్రావారిపాళెం మండలం, బోడేవాండ్లపల్లె సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద మాటు వేశామన్నారు. అర్ధ రాత్రి సమయంలో రహదారి గుండా అతి వేగంగా వస్తున్న కారును ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా వెళ్లడంతో కారును వెంబడించినట్టు వెల్లడించారు. గానుగచింత–రొంపిచెర్ల రోడ్డు బెస్తపల్లె సమీపంలో కారు నుంచి ఇద్దరు వ్యక్తులు దూకి పారిపోయారన్నారు. ఏపీ 04 ఏపీ 0117 కారును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అందులో పరిశీలించగా 272 కిలోల బరువుగల 14 ఎర్రచందనం దుంగలు ఉన్నట్టు గుర్తించామన్నారు. కారుతో సహా ఎర్రచందనం దుంగల విలువ రూ.12 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్ఓలు ప్రదీప్‌కుమార్, రాజేష్‌కుమార్, ఎఫ్‌బీఓలు ప్రదీప్‌చాంద్, నిఖిల్, శంకర్, ప్రభుతేజ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాంచారమ్మపేట ఘర్షణలో 14 మంది అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

చిల్లకూరు : మండలంలోని నాంచారమ్మపేట, ముత్యాలపాడు గ్రామాల్లో ఏర్పడిన ఘర్షణకు సంబంధించి 14 మందిని అరెస్ట్ చేసినట్టు అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. చిల్లకూరు పోలీస్ స్టేషన్ వద్ద శనివారం ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నాంచారమ్మపేట గ్రామానికి చెందిన మల్లారపు హరిప్రసాద్, కాటయ్య గ్రామంలోని బందెలదొడ్డిలో ఈనెల 22వ తేదీ వేకువజామున నిద్రిస్తున్న సమయంలో కొంతమంది వారిపై దాడి చేసి, పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు పెట్టారన్నారు. ఆ తర్వాత ఇంటి ముందు ఉన్న బైక్‌ను తగులబెట్టారని చెప్పారు. ఈ దాడిలో కాటయ్యకు గాయాలు కాగా హరిప్రసాద్ మృతి చెందాడని తెలిపారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాలు విచారణ చేపట్టినట్టు వెల్లడించారు. ముత్యాలపాడు, నాంచారమ్మపేటల్లో చోటు చేసుకున్న ఘర్షణ, హత్య కేసులకు సంబంధించి అట్రాసిటీ కేసులతో పాటుగా హత్య కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇందులో ప్రమేయం ఉందన కారణంతో 11 మంది రెండు గ్రామాలకు చెందిన వారు కాగా.. ముగ్గురు వ్యక్తులు కోట మండలానికి చెందిన వారిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఇంకా మరికొంత మందిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో గూడూరు, నాయుడుపేట డీఎస్పీలు రమణకుమార్, చెంచుబాబుతో పాటు గూడూరు పట్టణ, రూరల్, వాకాడు, నాయుడుపేట, సూళ్లూరుపేట సీఐలు, ఎస్ఐలు చొరవ చూపారన్నారు. ఈ మేరకు వారిని ఎస్పీ అభినందించనట్టు తెలిపారు. కేసులో ఉన్న ప్రతి ఒక్కరిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తామన్నారు. సమావేశంలో గూడూరు, నాయుడుపేట డీఎస్పీలు రమణకుమార్, చెంచుబాబు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ


మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న వీసీ

తిరుపతి సిటీ: యునైటెడ్ నేషన్స్ ఏషియన్ అండ్ పసిఫిక్ ట్రెనింగ్ సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఫర్ డెవలప్‌మెంట్, పద్మావతి మహిళా వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ టెక్నాలజీపై మహిళా పారిశ్రామిక వేత్తలకు మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ శనివారం ముగిసింది. శిక్షణకు హాజరైన మహిళా ఇంట్రపెన్యూర్స్‌కు వీసీ వీ.ఉమ సర్టిఫికెట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ మూడు రోజులుగా 8 సెషన్లలో అంతర్జాతీయ నిపుణులతో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. శిక్షణలో వ్యాపార కొనసాగింపు ప్రణాళిక, డేటా విశ్లేషణ, ఈ–కామర్స్, డిజిటల్ మార్కెటింగ్, డిజిటల్ సాంకేతికతలు, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలను కవర్ చేశామన్నారు. రిజిస్ట్రార్ రజినీ, ప్రొఫెసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పట్టుబడ్డ 11 ఇసుక ట్రాక్టర్లు


అరణియార్ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు

నాగలాపురం: మండలంలోని సుబ్బనాయుడుకండ్రిగ సమీపంలోని అరుణా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 11 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, నాగలాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా శ్రీసిటీకి ఇసుక తరలిస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి, కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ హనీఫ్, కృష్ణా, వీఆర్వో మహేష్, సుధా పాల్గొన్నారు.

బాలికల సైనిక్ స్కూల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

తిరుపతి ఎడ్యుకేషన్: కర్ణాటకలోని కిట్టూర్ రాణి చెన్నమ్మ బాలికల రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్లో 2025–26లో 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం పోటీ పరీక్షల కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్షను 2025, ఫిబ్రవరి 2వ తేదీ జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు 2013, జూన్ 1నుంచి 2015, మే 31మధ్య జన్మించిన బాలికలు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.